క్లుప్తంగా

చురుగ్గా బీటీ రోడ్డు నిర్మాణ పనులు


దొల్తాపురం వద్ద రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

చిప్పగిరి: మండల కేంద్రం నుంచి దొల్తాపురం, నంచర్ల గ్రామాల మీదుగా మద్దికెర వరకు రూ.10 కోట్లతో 12 కి.మీ మేర చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రస్తుతం కంకర పనులు దొల్తాపురం గ్రామం వరకు పూర్తయ్యాయి. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే నంచర్ల వాసులకు మండల కేంద్రానికి వచ్చి పోవడానికి 40 కి.మీ దూరం తగ్గనుంది. దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతుండడంతో దొల్తాపురం, నంచర్ల గ్రామవాసుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.

నోటు పుస్తకాల పంపిణీ

తుగ్గలి: స్థానిక మెయిన్ స్కూల్‌లో చదువుతున్న 55 మంది విద్యార్థులకు గురువారం పత్తికొండకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థులు ఈవీ రాహుల్‌గౌడ్, కె.హరికృష్ణ నోటు పుస్తకాలను అందించారు. కమ్యూనిటీ కనెక్టివిటీ కోర్సులో భాగంగా విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేసినట్లు వారు చెప్పారు. హెచ్‌ఎం రామాంజినేయులు, ఉపాధ్యాయుడు యోగేష్ పాల్గొన్నారు.

'నేను బడికి పోతా' కార్యక్రమం


మారెళ్లలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

తుగ్గలి: మండల పరిధిలోని మారెళ్లలో గురువారం 'నేను బడికి పోతా' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రాథమిక హెచ్‌ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని హెచ్‌ఎం కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు, పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం వంటివి అందిస్తోందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి

దేవనకొండ: మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ అఖిల భారత మహాసభ సంఘం జిల్లా నాయకులు బోయ మునిస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ.. శీతల గిడ్డంగుల్లో 75 లక్షల మిర్చి బస్తాలు నిల్వ ఉండిపోయాయన్నారు. ఒక్కసారిగా మిర్చి ధరలు కుప్పకూలడంతో దిగుబడులు కోల్డ్ స్టోరేజీల్లో కొండల్లా పెరిగిపోతున్నాయన్నారు. గుంటూరు, కర్నూలు, అనంతపురం, కడప ఇతర జిల్లాల్లో ఆరుగాలం చెమటోడ్చి పండించిన మిర్చి పంటను అమ్ముకుని నాలుగు కాసులు చూస్తామనుకున్న రైతులకు ధరలు పడిపోవడంతో నిరాశే ఎదురయ్యిందన్నారు. ప్రభుత్వం స్పందించి మిర్చి రైతులను ఆదుకోవాలని కోరారు.

సబ్సిడీ విత్తనాలివ్వాలి


పొలంలో గుంటక పాస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

ఆస్పరి: రైతులకు 90 శాతం సబ్సిడీతో ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు అందజేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని బిల్లేకల్లు గ్రామంలో రైతు సంఘం ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా అందంగా అలంకరించిన వృషభాలతో గిడ్డయ్య పొలంలో గుంటకను పాశారు. ఆయన మాట్లాడుతూ స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధర ఇచ్చే విధంగా చట్టం చేయాలన్నారు. సమగ్ర పంటల బీమా పథకం అమలు చేయాలని, 60 ఏళ్లు నిండిన రైతులకు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం, సీపీఐ నాయకులు తిమ్మయ్య, విరుపాక్షి, కృష్ణమూర్తి, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

రథోత్సవానికి తరలిరండి

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం గదగలో ఈ నెల 26న గానయోగి పంచాక్షర గవాయి, పద్మ భూషణ్ అవార్డు గ్రహీత పుట్టరాజ గవాయిల స్మరణోత్సవాలను పురస్కరించుకుని జరిగే ఉభయ గురుల మహా రథోత్సవానికి వీరశైవ లింగాయత్‌లతో పాటు అన్ని వర్గాల భక్తులు తరలివచ్చి జయప్రదం చేయాలని హొళగుంద మండల భక్తులు కోరారు. ఎంతో మంది అనాథలు, అంధ పిల్లలకు విద్య, అన్నదానంతో చేయూతనిచ్చిన మహాస్వాములను స్మరించుకుంటూ భారీ ఎత్తున కార్యక్రమాలు జరుగుతున్నట్లు వారు తెలిపారు. గదగలోని వీరేశ్వర పుణ్యాశ్రమం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నట్లు వారు చెప్పారు. వేడుకల్లో భాగంగా సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు ఈ వేడుకల్లో భాగస్వామ్యులు కావాలని కోరారు.

గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు

- ఈ నెల 30వ తేదీ వరకు వాటర్ ట్యాంకుల శుభ్రతపై స్పెషల్ డ్రైవ్
- తాగునీరు కలుషితం కాకుండా చర్యలు
- నియోజకవర్గంలో 109 ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులు
- ఇప్పటివరకు 55 ట్యాంకులు పరిశుభ్రం


ఆలూరు సంత మార్కెట్‌లోని రక్షిత మంచినీటి పథకం ట్యాంకు


ట్యాంకును శుభ్రం చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

ఆలూరు రూరల్: నైరుతి రుతుపవనాల రాకతో పలుచోట్ల విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షపు నీటితో మురుగు నీరు కలిసి అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వీటి నివారణకు అధికారులు ఈ నెల 18వ తేదీ నుంచి 30 తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ట్యాంకులను శుభ్రం చేయిస్తున్నారు. ఈ మేరకు అన్ని గ్రామ పంచాయతీలకు ఆదేశాలు అందాయి. పల్లె ప్రజలకు స్వచ్ఛమైన రక్షిత తాగునీటిని అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వర్షాలు కురుస్తుండడంతో తాగునీరు కలుషితం కాకుండా అవసరమైన జాగ్రత్తలు మొదలు పెట్టారు. ముఖ్యంగా గ్రామాల్లో మంచినీటి ట్యాంకులను శుభ్రం చేసేందుకు కార్యచరణ ప్రణాళిక రూపొందించి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఓవర్‌హెడ్ స్టోరేజ్ రిజర్వాయర్ (ఓహెచ్‌ఎస్‌ఆర్) లకు నీటిని సరఫరా చేసే మంచి నీటి పైపులు లీకై కలుషితం అవుతోంది. ఇలా లీకయ్యే పైపులను సకాలంలో గుర్తించకపోవడంతో, వాటి నుంచి సరఫరా అయ్యే నీటిని తాగడం వల్ల ప్రజలకు వాంతులు, విరేచనాలు, ఇతర రోగాల బారిన పడుతున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ శాఖల అధికారులు ప్రజలకు రక్షిత మంచినీటిని అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. నియోజకవర్గంలోని ఆలూరు మండలంలో 28, ఆస్పరిలో 23, చిప్పగిరిలో 8, హాలహర్విలో 13, హొళగుంద మండలంలో 17, దేవనకొండ మండలంలో 20 ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులు ఉన్నాయి. వీటిని ఈ నెల 30వ తేదీలోగా శుభ్రం చేసేందుకు ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే వివిధ గ్రామాల్లో 55 ట్యాంకులను పంచాయతీ, పారిశుద్ధ్య సిబ్బంది శుభ్రం చేశారు.

క్షేత్రస్థాయిలో అలసత్వం

విధిగా ప్రజలకు సురక్షిత తాగునీటినే అందించాలంటూ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు ఆదేశాలు ఇస్తున్నప్పటికీ పలు గ్రామాల్లో క్షేత్రస్థాయి సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తున్నారు. కొన్ని ట్యాంకుల వద్ద పరిసరాలను శుభ్రం చేయడం లేదు. లీకేజీ సమస్యలను పట్టించుకోవడం లేదు. ట్యాంకుల వద్ద ఏర్పాటు చేసిన బోర్డులపై శుభ్రపరిచిన తేదీ రాయడం లేదు. దీంతో పలు గ్రామాల్లో ఆ బోర్డులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

తాగునీటిని శుభ్రపరిచే చర్యలు ఇలా..

- ప్రతి 15 రోజులకు ఒకసారి కచ్చితంగా ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను శుభ్రం చేయాలి. అలాగే ట్యాంకుల వద్ద ఉన్న బోర్డుపై శుభ్రం చేసిన తేది, మళ్లీ శుభ్రం చేయనున్న తేదీని నమోదు చేయాలి.
- తాగునీటిని సరఫరా చేసే పథకాలను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలి.
- గ్రామ పంచాయతీలలో బ్లీచింగ్ పౌడర్, లిక్విడ్ క్లోరిన్ స్టాక్ ఉంచుకోవాలి.
- రక్షిత మంచినీటి ట్యాంకుల పరిసరాల్లో నీరు కలుషితం కాకుండా పరిశుభ్రంగా ఉంచాలి.
- ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులు తమ పరిధిలోని నీటి పథకాలను తనిఖీ చేస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలి.
- ముఖ్యంగా తాగునీటికి సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

పరిశుభ్రమైన నీటిని అందించేందుకు చర్యలు



గ్రామీణులకు రక్షిత మంచినీటిని అందించేందుకు, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాల్లోని వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించేందుకు ఈనెల 30వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ఇప్పటికే నియోజకవర్గంలోని 55 ట్యాంకులు శుభ్రం చేయించాం. ఆయా ట్యాంకుల ద్వారా ప్రజలకు సరఫరా చేసే తాగునీటిని క్లోరినేషన్ చేయిస్తున్నాం.

– మల్లికార్జునయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ఆలూరు

నేడు మోడల్‌స్కూల్‌లో ప్రవేశ పరీక్ష

కృష్ణగిరి: ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి శుక్రవారం పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ నిర్మలాకుమారి తెలిపారు. స్థానిక పాఠశాలలో ఆమె గురువారం మాట్లాడుతూ.. మిగిలిన సీట్లకు ఇప్పటివరకు 107 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, వీరందరూ ఉదయం 9 గంటలకు పాఠశాలలో నిర్వహించే ప్రవేశ పరీక్షకు హాజరుకావాలని సూచించారు.

స్వచ్ఛమైన నీరందించేందుకు చర్యలు

మద్దికెర: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే గాకుండా, ప్రజలకు సచ్ఛమైన తాగునీరందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఈఓఆర్డీ మద్దిలేటి స్వామి తెలిపారు. గురువారం మద్దికెరలోని నీటి ట్యాంకులను శుభ్రం చేయించి నీటిని క్లోరినేషన్ చేయించడంతో పాటు ట్యాంకు వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో రక్షిత మంచినీటిని అందించేందుకు ఆయా గ్రామాలలో ట్యాంకులను శుభ్రం చేయించడం జరిగిందన్నారు. వానలు కురుస్తుండడంతో నీరు కలుషితం గాకుండా అవసరమైన పనులు చేపట్టామన్నారు. ప్రజలు రోగాల బారిన పడకుండా ఓహెచ్ ట్యాంకులు, గ్రౌండ్ లెవెల్ ట్యాంకులు క్లీన్ చేయించేందుకు ఈనెల 30వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు.

పొదుపు రుణాలు సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న పీడీ సలీంబాషా

మద్దికెర: పొదుపు సంఘాల మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలని పీడీ సలీంబాషా సూచించారు. గురువారం స్థానిక పొదుపు కార్యాలయంలో సంఘాల లీడర్లతో సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొదుపు సంఘాలకు బ్యాంకులు రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు ఇస్తున్నాయన్నారు. వాటిని స్వయం ఉపాధి పొందేందుకు వినియోగించుకోవాలని, సకాలంలో కంతులు చెల్లించాలని సూచించారు. కంతులు సక్రమంగా చెల్లించకపోతే సంఘాలలో ఉన్న మహిళలకు రుణ సదుపాయం అందక ఇబ్బందులు పడతారన్నారు. కెనరాబ్యాంకు ఆర్ఓ రఘువీర్, బ్యాంకు మేనేజర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నీరే జీవకోటికి ప్రాణాధారం


నేమకల్లులో అవగాహన ర్యాలీని నిర్వహిస్తున్న దృశ్యం


అవగాహన కల్పిస్తున్న ఈఓఆర్డీ, హెచ్ఎం

చిప్పగిరి: జీవకోటికి నీరే ప్రాణాధారమని ఈఓపీఆర్డీ బాలన్న అన్నారు. గురువారం మండలంలోని నేమకల్లు, సంఘాల గ్రామాల్లో సేవ్ వాటర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తాగునీటి పొదుపు ఆవశ్యకతను వివరిస్తూ విద్యార్థులచే గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అలాగే విద్యార్థులకు నీటి ప్రాముఖ్యతపై వక్తృత్వ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయులు పాలొన్నారు.

తాగునీటిని వృథా చేయరాదు

మద్దికెర: తాగునీటిని పొదుపుగా వాడుకోవడం విద్యార్థి దశ నుంచే అలవాటు చేసుకోవాలని ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, ప్రధానోపాధ్యాయులు దేవేంద్రప్ప సూచించారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో నీరు-పొదుపు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఇంకుడు గుంతల వల్ల ఉపయోగాలను వివరించారు. భూగర్భజలాల పెంపునకు కృషి చేయాలని సూచించారు. ఈఓ కరుణకుమారి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లార్తి దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు


శేక్షావలి దర్గాలో సమాధిని దర్శించుకుంటున్న భక్తులు

హొళగుంద: మండల పరిధిలోని ఎల్లార్తి శేక్షావలి, షాషావలి దర్గాల్లో గురువారం ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. మొక్కులు ఉన్న భక్తులు రాత్రి దర్గా ఆవరణం, పరిసరాల్లో నిద్రించి ఉదయం స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా హొళగుంద సాయిబన్న, చిణిగి తాతా దర్గాల్లో, షిర్డీ సాయిబాబా ఆలయానికి భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. తీర్థ ప్రసాదాల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సెబ్ సీఐ భాస్కర్ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థులు డ్రగ్స్, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని వాటికి అలవాటు పడితే జీవితాలు నాశనం అవుతాయని సెబ్ సీఐ భార్గవ రెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని వైష్ణవి జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాలను వినియోగించడం ద్వారా కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలకు బానిస కావడం ద్వారా అనారోగ్యంతో పాటు శారీరకంగా, మానసికంగా కృషించిపోవడమే గాకుండా చట్టపరంగా నేరస్థులవుతారని హెచ్చరించారు. ఇంటర్మీడియెట్ స్థాయిలో క్రమశిక్షణతో చదువుకుంటేనే ఉన్నత చదువులకు వెళ్లగలరని అప్పుడే వారి భవిష్యత్‌కు మంచి మార్గం ఎంచుకునేందుకు వీలుంటుందని తెలిపారు. మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాలపై తమకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు కూడా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కళాశాల కరెస్పాండెంట్ జి.లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన పశు వైద్యశాలలు



రామదుర్గంలో సగం కూలిపోయిన పశు వైద్యశాల భవనం,నేమకల్లులో శిథిలావస్థకు చేరిన పశు వైద్యశాల

చిప్పగిరి: మండలంలోని నేమకల్లు, రామదుర్గం గ్రామాల్లో పశు వైద్యశాల భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు కూలిపోతాయోనని సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. నేమకల్లు పశు వైద్యశాల శిథిలావస్థకు చేరుకోగా రామదుర్గంలో ఇప్పటికే సగం భవనం కూలిపోయింది. భవనాలు పాతబడడంతో పాములు, విషపురుగులు అనేక సార్లు లోపలికి ప్రవేశించినట్లు సిబ్బంది వాపోయారు. పశువైద్యశాలలో మౌలిక వసతులు లేకపోవడంతో రైతులు తమ పశువులకు జబ్బు చేస్తే ప్రైవేటు వైద్యులను సంప్రదిస్తున్నారు. వెంటనే పశు వైద్యశాలలకు నూతన భవనాలను నిర్మించి సౌకర్యాలు కల్పించాలని పాడి రైతులు, సిబ్బంది ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం


మాట్లాడుతున్న ఆర్డీఓ నీలపు రామలక్ష్మి


తుగ్గలిలో తహసీల్దార్ షర్మిలను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

పత్తికొండ రూరల్: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దారు మాధవరావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా పత్తికొండ రెవెన్యూ డివిజన్ అధికారిణి నీలపు రామలక్ష్మి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ.. భూసమస్యల సత్వర పరిష్కారానికి అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. అనంతరం రైతులకు అడంగల్, 1బీ రికార్డులను పంపిణీ చేశారు. వీఆర్ఓలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అనంతాచారి, డీటీ ధనుంజయరెడ్డి సిబ్బందికి, ప్రజలకు రెవెన్యూ పరంగా అందిస్తున్న సేవల గురించి వివరించారు. రెవెన్యూ శాఖలో ఉత్తమ సేవలందించి త్వరలో ఉద్యోగ విరమణ చేసే ఉద్యోగులను సన్మానించారు. సిబ్బంది పాల్గొన్నారు.

ఆలూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ డే సందర్భంగా ఆ శాఖలో వివిధ హోదాల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన ఉద్యోగులను ఎంఆర్ఐ బసన్నగౌడు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ చంద్రశేఖరయ్య మాట్లాడుతూ.. రెవెన్యూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వీఆర్వోలు అమరేశ్వరరెడ్డి, సత్యనా రాయణ, రవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి: రెవెన్యూ దినోత్సవాన్ని గురువారం తుగ్గలిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తహసీల్దార్ షర్మిల మాట్లాడారు. మొదటి రెవెన్యూ డేగా నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. రెవెన్యూ శాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను ఆమె వివరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సేవలందించి రెవెన్యూ శాఖకు మరింత మంచి పేరు తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. అనంతరం రెవెన్యూ శాఖలో పని చేస్తూ పదవీ విరమణ పొందిన ఆర్ఐ సీతారాములతో పాటు తహసీల్దార్‌ను రెవెన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించారు. సీనియర్ అసిస్టెంట్ రాముడు, ఆర్ఐ సుధాకర రెడ్డి, సర్వేయర్ గాదిలింగప్ప, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.


రిటైర్డ్ రెవెన్యూ అధికారులను సన్మానిస్తున్న ఆలూరు తహసీల్దార్ చంద్రశేఖరయ్య

రెవెన్యూ సేవలను సద్వినియోగం చేసుకోండి

ఆస్పరి: రెవెన్యూ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఈరమ్మ సూచించారు. ఆమె గురువారం ఆస్పరి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో రెవెన్యూ దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. రెవెన్యూ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు, రైతులకు, విద్యార్థులకు కావాల్సిన సర్టిఫికెట్లు ఎప్పటికప్పుడు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 1776 జూన్ 20వ తేదీన రెవెన్యూ వ్యవస్థ ఆవిర్భవించిందన్నారు. ఈ రోజును రెవెన్యూ దినోత్సవంగా జరుపుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. డీటీ గాయత్రీ, ఆర్ఐ భీమేష్, సర్వేయర్ మంజుభార్గవి, వీఆర్ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


ఆస్పరిలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఈరమ్మ

ప్రభుత్వ పాలనలో రెవెన్యూ శాఖ కీలకం

మద్దికెర: ప్రభుత్వ పాలనలో రెవెన్యూ శాఖ కీలకంగా వ్యవహరిస్తూ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ముందుంటుందని తహసీల్దార్ రజాక్‌వలి అన్నారు. గురువారం రెవెన్యూ డే సందర్భంగా స్థానిక కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక ఆంధ్ర ఏర్పాటుతో బోర్డు ఆఫ్ రెవెన్యూ 1953లో ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ భూములు, రైతులకు సంబంధించిన భూములను గుర్తించి వారి సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. సూపరింటెండెంట్ సునీత, ఆర్ఐ రవికుమార్, వీఆర్వోలు రంగస్వామి, రషీద్, మల్లికార్జున, బాలవర్ధి, రహిమాన్, పక్కీరప్ప తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ రజాక్‌వలి

నీటి సమస్య పరిష్కరించాలి

ఆస్పరి: మండలంలోని జొహరాపురం గ్రామంలో నెలకొన్న మంచి నీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. వారు గురువారం మాట్లాడుతూ.. బాపురం రిజర్వాయర్ నుంచి వచ్చే నీరు గ్రామానికి సరిపోకపోవడంతో స్థానికంగా ఒక్కిరేణిలో ఉన్న బురద నీటినే తాగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

కార్మికులకు సౌకర్యాలు కల్పించాలి

దేవనకొండ: స్థానిక గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్యం, డ్రెయినేజీ, విద్యుత్, తాగునీటి సరఫరా విభాగాల్లో 20 మంది కార్మికులు పనిచేస్తున్నారని, వారికి కనీస సౌకర్యాలు కల్పించాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకుడు ఇనాయతుల్లా అధికారులను కోరారు. ఈ మేరకు గురువారం పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు.

ఫిల్టర్‌బెడ్‌కు నిలిచిన నీటి సరఫరా


హొళగుందలోని ఫిల్టర్‌బెడ్‌లో నిల్వ ఉన్న నీటిని తీసుకెళ్తున్న గ్రామస్తులు

హొళగుంద: స్థానిక ఫిల్టర్‌బెడ్‌కు మళ్లీ నీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామంలో తాగునీటి ఎద్దడి నెలకొంది. కడ్లమాగి వద్ద నిర్మించిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నుంచి హొళగుందలో ఉండే ఫిల్టర్‌బెడ్‌కు నీటిని పంపింగ్ చేసి అక్కడి నుంచి గ్రామానికి సరఫరా చేస్తారు. అయితే ఇటీవల కాలంలో ఫిల్టర్‌బెడ్‌కు నీటిని సరఫరా చేసే పైప్‌లైన్ అక్కడక్కడా దెబ్బతిని లీకేజీలు ఏర్పడడంతో నీరు సరఫరా కావడం లేదు. ఈ కారణంగా ఫిల్టర్‌బెడ్‌లో తగినంతగా నీరు లేకపోవడంతో గ్రామానికి తాగునీటి సరఫరా జరగక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్తున్నారు. ఇప్పటికే వారాల తరబడి నీరు అందక ఇబ్బందులు పడ్తున్న ప్రజలు ఇంకెన్నాళ్లకు నీరు అందుతాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తరుచూ ఇలాంటి సమస్య ఏర్పడడం వల్ల నీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారని, అధికారులు వెంటనే స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

టమాట @ 80

హొళగుంద: కొద్ది రోజుల క్రితం వారపు సంత మార్కెట్‌లో కిలో టమాట రూ.15 ఉండగా ప్రస్తుతం రూ.80 దాటింది. దీంతో ప్రజలు టమాట లేని కూరలను తినాల్సి వస్తోంది. మండలంలో కూరగాయల సాగు తగ్గడం, టమాట లాంటి పంటను ఇక్కడి రైతులు సాగు చేయకపోవడంతో ధర పెరిగింది. కొద్దిమంది రైతులు అక్కడక్కడా సాగుచేసిన టమాట పంట చేతికొచ్చేందుకు నెలన్నరకు పైగా సమయం పడుతుంది. ఇతర ప్రాంతాల్లో సాగు చేసిన టమాట వర్షాల కారణంగా దెబ్బతినడంతో దిగుబడి తగ్గి ధరలు పెరుగుదలకు కారణమైంది. ధర మరింత పెరిగే అవకాశాలున్నాయని వ్యాపారస్తులు అంటున్నారు. ఇతర ప్రాంతాల నుంచి టమాట కొని తీసుకొచ్చి ఇక్కడ అమ్ముకుంటున్నామని, అయితే పట్టణాల్లోని దళారులు కృత్రిమ కొరతను సృష్టించి సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. ఇప్పుడున్న ధరలను చూసి పేద, మధ్య తరగతి ప్రజలు టమాట, బీన్స్, మిరపను కొనలేకపోతున్నారు. మండలంలో టమాటాతో పాటు ఇతర కూరగాయల సాగు తక్కువ ఉండడంతో ఇతర ప్రాంతాల్లో సాగులో ఉన్న టమాటాకు డిమాండ్ పెరిగింది. దీంతో బళ్లారి, మదనపల్లి, ఆదోని, గుంతకల్ తదితర పట్టణాల నుంచి దిగుమతి చేసుకుని ఎక్కువ ధరలకు అమ్ముకుంటున్నారు.


విక్రయానికి ఉంచిన టమాట